## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బాలరాజు దంపతులు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆదుకోవడంలో మహానేత స్వర్గీయ వైఎస్సార్ మన అందరికీ స్ఫూర్తి అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శనివారం చొప్ప రామన్నగూడెం, కొయ్యలగూడెంలలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్త తొంటా రాజు కుమారుడు దుర్గాప్రసాద్ కంటి చికిత్స నిమిత్తం నూకల రాము రూ.5 వేలు, పార్టీ నాయకులు సమకూర్చిన మరో రూ.5 వేలు కలిపి మొత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, మారిశెట్టి శ్రీను, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, తగరం ఆశీర్వాదం పాల్గొన్నారు.

### బుర్రకథల బ్రహ్మం మృతి



బుర్రకథ కళాకారుడు వీరబ్రహ్మచారి (ఫైల్)

టి.నరసాపురం: బొర్రంపాలెం గ్రామానికి చెందిన సీనియర్ బుర్రకథ కళాకారుడు తిప్పర్తి వీర బ్రహ్మచారి (75) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ గుంటూరులో చికిత్స పొందుతున్నారు. బొర్రంపాలెం శ్రీ సరస్వతి బుర్రకథ దళంలో సభ్యుడైన వీర బ్రహ్మం తనదైన శైలిలో బుర్రకథ చెబుతూ కడుపుబ్బా నవ్వించడంలో దిట్ట అని ప్రధాన కథకుడు వీరమల్ల సత్యనారాయణ తెలిపారు. బుర్రకథలలో అత్యంత ప్రతిభ కనపరచడంతో తన ఇంటిపేరునే బుర్రకథల బ్రహ్మంగా పిలిచే విధంగా గ్రామంలో పేరు గడించారన్నారు. బ్రహ్మంకు భార్య, ముగ్గురు కుమారులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. బ్రహ్మం మృతికి బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు, వీర మల్ల సత్యనారాయణ, బచ్చు నందకుమార్, టీవీఎస్ రాజు, ఎల్ఆర్ కృష్ణబాబు, వీరమల్ల మధు, చిలుకూరి సుబ్బయ్యాచారి పలువురు గ్రామస్తులు సంతాపం తెలియజేశారు.

### క్రీడా సామగ్రి అందజేత

జంగారెడ్డిగూడెం రూరల్: విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు చేతులమీదుగా క్రీడా సామగ్రిని అందజేశారు.

### ఉత్సాహంగా పోటీలు

జంగారెడ్డిగూడెం: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా పట్టణంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పురుషులు, మహిళల విభాగంలో క్రికెట్‌పోటీలు జరిగాయి. పురుషుల, మహిళల విభాగాల్లో ఒక్కో మ్యాచ్ నిర్వహించారు. విజేతలు మండల స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు.

### సామాజిక తనిఖీ గ్రామసభలు

పోలవరం రూరల్: మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం పనులు పరిశీలించి గ్రామసభలు నిర్వహించారు. పోలవరం మండలం గూటాల గ్రామంలో సచివాలయం వద్ద శనివారం గ్రామ సభ నిర్వహించి గ్రామపంచాయతీలో జరిగిన పనుల వివరాలను వివరించారు. ఉపాధి హామీ కూలీలకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని పేర్కొన్నారు. పనులు చేసిన కూలీలకు సక్రమంగా వేతనాలు అందాయా లేదా, జాబ్‌కార్డులు ఎవరికైనా కావాలా అనే విషయాలను చర్చించారు. డిస్ట్రిక్ రీసోర్స్‌పర్సన్ జయప్రకాష్, సొసైటీ అధ్యక్షుడు సుంకర అంజిబాబు, ఎంపీటీసీ దెగపాటి హరి రామకృష్ణ, సెక్రటరీ పి.విజయలక్ష్మి, పంచాయతీ ఉపసర్పంచ్ కరిబండి శ్రీను పాల్గొన్నారు.

# పండుగలా పించన్ల పంపిణీ

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండగను తలపిస్తోందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 వేలకు పెంచిన పింఛన్లను పంపిణీ చేయడంతో అవ్వతాతలు, వితంతువుల్లో ఆనందం వెల్లివిరుస్తుందని అన్నారు. జీలుగుమిల్లి మండలంలో మొత్తం 4384 పింఛన్లకు సుమారు రూ.కోటి 34 లక్షల 85 వేల వలంటీల ద్వారా నేరుగా అర్హులకు అందజేయడం జరిగిందని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ సీఎంగా ఆశీర్వదించాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వి.వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, జెడ్పీటీసీ మల్లం వంసతరావు, వైస్ ఎంపీపీలు సోమగాని శ్రీనివాస్, ఉప్పల లలిత కుమారి, ఎంపీటీసీ సున్నం సురేష్, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా నాయకులు గూడవల్లి శ్రీనివాసరావు, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి తదితరులు



శ్రీనివాసపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పింఛన్ లబ్ధిదారులు

**సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం**

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీనివాసపురంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు రూ.3వేల పింఛన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా పింఛన్ల సొమ్ము పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ వృద్ధులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీపీ నాయకులు సిర్రా రాజేష్ పాల్గొన్నారు. అలాగే లక్కవరంలో సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఎంపీపీ కొదమ జ్యోతి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, పార్టీ నాయకులు నిమ్మ రామకృష్ణ, బడి దుర్గారావు, దల్లి నాగేశ్వరరావు, మల్లెల్లి సూర్యనారాయణ చిల్ల దుర్గారెడ్డి పాల్గొన్నారు. అలాగే లక్కవరంలో సచివాలయ కన్వీనర్ దల్లి నాగేశ్వరరావు చేతుల మీదుగా పింఛన్ నగదును అందజేశారు.

## వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో స్వామివారు

జంగారెడ్డిగూడెం: ధనుర్మాస ఉత్సవాలు పురస్కరించుకుని శనివారం పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారితోపాటు దేవేరులకు, గోదాదేవికి విశేష పూజాకార్యక్రమాలు ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. విశేష అలంకరణ అనంతరం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అయ్యప్ప, భవానీ మాలాధారణ స్వాములు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు వేల్పూరుకు చెందిన బండ దుర్గజయకుమార్, భీమవరం పెన్మెత్స సాయిసత్య సురేష్‌వర్మ అన్నప్రసాద వితరణ చేయగా, పాలిశెట్టి వెంకటసూర్యనాయణ ప్రసాద వితరణ చేశారని ఈవో రాంబాబు తెలిపారు.

## గిరిపల్లెల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభం



విద్యార్థులతో నృత్యాలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి



సంక్రాంతి సంబరాల్లో ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో అప్పుడే సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. సంక్రాంతి సంబరాలను జరుపుకునేందుకు ఒక పక్క గ్రామాల్లో ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటుంటే మరొక పక్క పాఠశాలల్లో తెలుగుదనం పండుగ శోభ ఉట్టిపడేలా సంక్రాంతి వేడుక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆకట్టుకుంటున్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుట్టాయగూడెం మండలం తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంక్రాంతి పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి భోగి మంటలు వేసి పండుగను ప్రారంభించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు నృత్యాలు చేశారు. అలాగే మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాఠశాల ప్రాంగణంలో రకరకాల రంగవల్లులు వేసి అందంగా తీర్చిదిద్దారు. హరిదాసులు, గంగిరెద్దుల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అలాగే గొబ్బెలను ఏర్పాటు చేసి పూజించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు, తెల్లం వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు గగ్గులోతు మోహన్‌రావు, నాయకులు ఆరేటి సత్యనారాయణ, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామవరపుకోట: టైలరింగ్ శిక్షణ తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, తడికలపూడి ఎన్టీఆర్ మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ బి.రిబ్కా శామ్యూల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ అనుసంధానంతో, తడికలపూడిలోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో 2 నెలల కాల పరిమితితో టైలరింగ్ కోర్సు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, 8వ తరగతి చదివి 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జెరాక్స్‌తో ఈనెల 10వ తేదీ లోపు తడికలపూడి మహిళా ప్రాంగణంలో దరఖాస్తులను సమర్పించాలని ఆమె కోరారు.

### పట్టెన్నపాలెంలో బోరు, పైపులైన్ పనుల ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్: పట్టెన్నపాలెంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.11.7 లక్షల నిధులతో బోరు, పైపులైన్ పనులను శనివారం సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోరు నుంచి పైపులైన్‌ను మంచినీటి వాటర్ ట్యాంకు అనుసంధానం చేస్తున్నామని, గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్ పసుపులేటి నాగార్జునరావు, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

### నిడదవోలు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లలిత

పోలవరం రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ కుమార్తె ఇంట్లో ఉన్న వృద్ధురాలికి వలంటీర్ పింఛన్ అందజేసింది. పోలవరం సచివాలయం -2 పరిధిలోని పాత పోలవరంలో గల కె.విజయలక్ష్మి పింఛన్ లబ్ధిదారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ నిడదవోలులోని కుమార్తె ఇంటి వద్ద ఉంటోంది. ఆ వృద్ధురాలకు వలంటీర్ సిద్దా లలిత శనివారం నిడదవోలు వెళ్లి పింఛన్ అందజేసింది. వలంటీర్ మానవత దృక్పథాన్ని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## గిరిజన గ్రామాల్లో పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ



ముంజులూరులో పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరు, ఉప్పరిల్ల గ్రామాల్లో శనివారం జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్, వికాస్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం వల్ల గిరిజనులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఇది తక్కువ ధరలకు దొరికే పౌష్టికాహారమని చెప్పారు. కోళ్ల ద్వారా గుడ్లు, మాంసం వంటి ప్రొటీన్ రీట్ ఆహారాన్ని పొందడంతోపాటు కుటుంబ ఆరోగ్యాన్ని కూడా పెంచుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, వికాస్ ప్రతినిధి రాజు, జార్జ్ ఇనిస్టిట్యూట్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు సూర్య, దుర్గ, సిబ్బంది, పృథ్వి, సునీల్, కరుణ్, పోసి లక్ష్మి, రేణుక, ప్రభావతి, దుర్గాదేవి, రవికుమార్, కె.రవి, తదితరులు పాల్గొన్నారు.

## రంగా ఆశయ సాధనకు కృషి చేస్తా



కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడులో అభిమానులతో వంగవీటి రాధాకృష్ణ

జంగారెడ్డిగూడెం రూరల్: దివంగత నేత వంగవీటి రంగా ఆశయ సాధనకు కృషి చేస్తానని ఆయన బాటలో అందరినీ నడిపిస్తా అని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెం మండల పర్యటనకు విచ్చేసిన సందర్భంగా వై జంక్షన్ నుంచి దిప్పకాయలపాడు వరకు పర్యటన సాగింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాధాకృష్ణకు ఘన స్వాగతం పలికారు. వంగవీటి రంగా ఏ ఒక్క సామాజిక వర్గానికి చెందిన నేత కాదని బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని అన్నారు. రంగా భౌతికంగా లేనప్పటికీ ఆయన ఆశయాలను కొనసాగిస్తున్న వారు అందరూ ఆయనకి వారసులేనని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పేర్కొన్నారు. అనంతరం కొయ్యలగూడెంలోని వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని రాధాకృష్ణ ఆవిష్కరించారు. దిప్పకాయలపాడులో అభిమానులతో సమావేశం అయ్యారు.

### అంగన్‌వాడీలు వెంటనే విధుల్లో చేరాలి

ద్వారకాతిరుమల: ప్రభుత్వం ఎస్మా ప్రయోగించిన కారణంగా అంగన్‌వాడీలు వెంటనే విధుల్లో చేరాలని లేకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తహసీల్దార్ పి.సతీష్ అన్నారు. స్థానిక మండల కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలతో శనివారం తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో తిరుపతిరావు, జంగారెడ్డిగూడెం సీడీపీవో బ్యూల తదితరులు మాట్లాడారు. వెంటనే విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగించేందుకు ప్రభుత్వం అత్యవసర సేవల చట్టం కింద ఎస్మా జీవో జారీ చేసిందన్నారు. అంగన్‌వాడీలు వెంటనే ఆందోళనలను విరమించి, విధులకు హాజరు కావాలని ఆయన సూచించారు.

## యూరియా కలిసిన నీరు తాగి ఐదు పశువులు మృతి

- మరో 4 దూడలు, 5 గేదెలకు అందుతున్న చికిత్స
- రైతును పరామర్శించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



గుండుగొలనుకుంటలో మృతి చెందిన గేదెను పరిశీలిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పశుసంవర్ధకశాఖ జేడీ నెహ్రూబాబు

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలనుకుంటలో యూరియా కలిపిన నీరు తాగి ఐదు పశువులు మృతి చెందాయి. వాటిని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం ఉదయం పరిశీలించి, పాడి రైతు ఉజ్జు గంగరాజును పరామర్శించారు. వివరాల ప్రకారం. రైతు గంగరాజు రోజులానే తన పశువులను శుక్రవారం సాయంత్రం ఆయిల్‌పామ్ తోటలో కట్టేసి, వాటికి తాగునీటిని అందించాడు. అయితే రాత్రికి పశువులు నురగలు కక్కుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడాన్ని గమనించిన రైతు వెంటనే వాటికి వైద్యాన్ని చేయించాడు. అయితే మూడు గేదెలు, ఒక ఆవు, ఒక దూడ మృతి చెందాయి. మిగిలిన 5 గేదెలు, నాలుగు దూడలకు వైద్యులు తెల్లవార్లు చికిత్సనందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలారి హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని, బాధిత రైతును పరామర్శించారు. అలాగే ప్రమాదానికి గల కారణాలను ఎమ్మెల్యే తలారి, ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు, భీమడోలు ఏడీ డాక్టర్ సాయిరమేష్, మండల పశువైద్యాధికారి అంగర సురేష్ స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. పక్క పొలం రైతు తన మొక్కజొన్న తోటకు డ్రిప్ ద్వారా యూరియాను అందిస్తున్నాడని, అది తెలియక ఆ పైప్ ద్వారా వెళ్లే నీటిని పశువులకు పెట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని వారు తెలిపారు. పాడిపైనే ఆధారపడ్డ తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే తలారి వద్ద బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉంటే ఏలూరు ల్యాబ్ ఏడీ డాక్టర్ సుచరిత, డాక్టర్ జయశ్రీ మృతి చెందిన పశువులకు పోస్టుమార్టం నిర్వహించారు. రైతును పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, స్థానిక సర్పంచ్ బండారు ధనలక్ష్మి, సొసైటీ చైర్‌పర్సన్ గోపా నాగేశ్వరరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి ఆంజనేయులు, చిలుకూరి సుబ్రహ్మణ్యం, బండారు నాగ సుబ్రహ్మణ్యం, బండారు కాశీ, సాధనాల రాజా, బండారు వెంకన్నబాబు, కుమ్మరి రమేష్, ఎలమర్తి భాస్కరచౌదరి, మోహనరావు, మానుకొండ సుబ్బారావు, బొండాడ వెంకన్నబాబు తదితరులున్నారు.

### వంట సామగ్రి బహూకరణ

ద్వారకాతిరుమల: శ్రీవారి మహా నివేదనశాలకు ఏలూరుకు చెందిన అంబికా అగరుబత్తి కంపెనీ వారు వంట సామగ్రిని శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు సంబంధిత రసీదును అందజేశారు. అనంతరం వారికి స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

### మోటార్‌సైకిళ్ల చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిళ్ల చోరీపై అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన పిప్పర శ్రీనివాస్ ఈ నెల 4న బుట్టాయగూడెం రోడ్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రి బయట బైక్ ఉంచి ఆసుపత్రి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి మోటార్‌సైకిల్ కనిపించలేదు. అలాగే జంగారెడ్డిగూడెం హెచ్‌డీఎఫ్ బ్యాంకులో పనిచేస్తున్న సాయిల అశోక్‌కుమార్ ఈ నెల 3వ తేదీన బ్యాంకు వద్ద తన మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి బ్యాంకు విధులకు హాజరయ్యాడు. ఉదయం 11.25 గంటలకు బయటకు వచ్చి చూసే సరికి మోటార్‌సైకిల్ కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భర్త వేధింపులపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. మైసన్నగూడెం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు శ్రీనివాస్, మేరీలకు రెండేళ్ల క్రితం వివాహమైంది. వివాహమైన నాటి నుంచి శ్రీనివాస్ సరిగా ఉండటం లేదని, వేరొక స్త్రీతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను మానసికంగా , శారీరికంగా వేధిస్తున్నట్లు మేరీ ఫిర్యాదులో పేర్కొంది. అత్త మాటలు విని తన భర్త హింసిస్తున్నాడని, ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన తలపై బాటిల్‌తో కొట్టి గాయపర్చగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మేరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినటు ఎస్సై తెలిపారు.

### వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం: అక్రమంగా నాటు సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన చల్లారి నాగరాజు తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా నాటు సారా తరలిస్తుండగా లంకాలపల్లి చెక్‌పోస్టు వద్ద అతడిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

### క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి ప్రారంభించారు. అలాగే వారిరువురూ క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. జీలుగుమిల్లి మండల టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో మెగా ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ పోటీలో గెలుపొందిన టోర్నమెంట్ విజేత టీమ్‌కు రూ.30,116, రనరప్‌కు రూ. 20,116, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10,,116 నగదు బహుమతితో పాటు మ్యాన్ ఆఫ్‌ది సిరీస్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌లకు బహుమతులు అందించడం జరుగుతుందని టీబీఆర్ యూత్ సభ్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వద్దు

పోలవరం రూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ బి.సుమతి పాఠశాల సిబ్బందికి సూచించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆమె ఎంపీడీవో జి.శ్రీనుతో కలిసి శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసే పోలింగ్ స్టేషన్‌లను కూడా పరిశీలించారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా లేదా అనే విసయాలపై సిబ్బంది నుంచి తెలుసుకున్నారు.



**బహిరంగ వేలము ప్రకటన**

**కొయ్యలగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నెం : జెడ్/22, కొయ్యలగూడెం**

ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలం, కొయ్యలగూడెం గ్రామములో గల కొయ్యలగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లి.నెం. జెడ్/22, కొయ్యలగూడెం నందు ఈ దిగువ తెలిపిన బకాయి బాకీదారులు సదరు సంఘము నందు ఋణము తీసుకొని తిరిగి చెల్లించకపోవుట వలన వారు సంఘమునకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులను ఈ దిగువ తెలిపిన తేదీల డిప్యూటీ రిజిస్ట్రారు/ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. ఏలూరు వారి ఉత్తర్వుల ప్రకారం ది.08.01.2024 వ తేదీన సీనియర్ ఇన్‌స్పెక్టర్ / సేల్ ఆఫీసర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి॥ కొయ్యలగూడెం వారిచే కొయ్యలగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లి.నెం. జెడ్/22 కొయ్యలగూడెం సొసైటీ ఆఫీసు నందు ఈ దిగువ తెలిపిన తేదీన బహిరంగ వేలము వేయబడును. కావున ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవలెను.

| వ. నెం. | ఖ.నెం | ఇ.పి.నెం | బకాయిదారుని పేరు | ఆస్తి ఉన్న గ్రామం | సర్వే.నెం | విస్తీర్ణం ఎ.సెం | సరిహద్దులు | చెల్లించవలసిన మొత్తము | వేలము వేయు తేది, సమయం, స్థలము |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | 5896 | 84/2021-22<br>127/2021-22<br>94/2021-22 | తలకొండ నాగేశ్వరరావు తం॥ పోతురాజు అమ్మపాలెం | పరింపూడి | 742/1<br>742/3<br>761/1 | 1-86<br>0-17<br>2-72<br>4-75 | కలవు | 38,36,884/- రూ.లు ధర్మల వడ్డీ + ఇతర ఖర్చులు | ది.08.01.2024 మ॥ 02.00 ని॥లకు కొయ్యలగూడెం పి.ఎ.సి.యస్ నందు జరుగును |

సం/- వై.ఏసుకుమార్
సీనియర్ ఇన్‌స్పెక్టర్/సేల్ ఆఫీసర్
జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. ఏలూరు,
HQ : జంగారెడ్డిగూడెం